# నమస్తే తెలంగాణ

జోగులాంబ గద్వాల వనపర్తి

3 మహబూబ్‌నగర్, ఆదివారం 17 మార్చి 2024 JOGULAMBA GADWAL WANAPARTHY


## భార్యను హతమార్చిన భర్త

• తానూ ఆత్మహత్య చేసుకున్న వైనం

కోడేరు, మార్చి 16 : భార్యను హతమార్చి ఉరేసుకొని భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని రాజాపూర్‌లో చోటుచేసుకున్నది. కొల్లాపూర్ సీఐ మహేశ్ కథనం ప్రకారం.. కోడేరు మండలం తుర్కదిన్నెకు చెందిన శివశంకర్(35).. రెండో భార్యగా రాజాపూర్‌కు చెందిన బాలీశ్వరమ్మ అలియాస్ భారతి(28)ని వివాహం చేసుకున్నాడు. వీరికి మూడేళ్ల కుమారుడు ఉండగా.. ప్రస్తుతం భారతి 6 నెలల గర్భవతి. అయితే, మొదటి భార్య నర్మద తుర్కదిన్నెలో ఉంటున్నది. శివశంకర్, బాలీశ్వరమ్మ హైదరాబాద్‌లో జీవిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా గ్రామానికి వచ్చారు. కాగా, నర్మద అత్తగారింట్లో ఉంటుండడంతో బాలీశ్వరమ్మ నిరాకరించి రాజాపూర్‌కు వెళ్లింది. తుర్కదిన్నెకు రావాలని శివశంకర్ చెప్పినా వినలేదు. బాలీశ్వరమ్మ కోడేరులో బంధువుల ఆహ్వానం మేరకు శనివారం దేవర్ల పండుగకు వెళ్లారు. బాలీశ్వరమ్మ ఒంటరిగా ఉండగా భర్త వచ్చి తుర్కదిన్నెకు రావాలని కోరాడు. అందుకు ఆమె అంగీకరించకపోవడంతో కోపోద్రిక్తుడై భర్త గొంతుకోసి, కణతపై ఇనుప ఊచతో విచక్షణారహితంగా పొడవడంతో అక్కడికక్కడే మృతిచెందింది. వెంటనే ఇంటికి గొళ్లెం పెట్టి వెళ్లి తుర్కదిన్నె సమీపంలో తన పొలంలో నిర్మించిన పౌల్ట్రీఫాంలో శివశంకర్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కురుమూర్తి ఇచ్చిన సమాచారం మేరకు సీఐ మహేశ్ ఘటనా స్థలాలను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.



మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య బాలరాముడిని శనివారం తన జన్మదినం సందర్భంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటయ్య, నాయకులు రఘుపతి గౌడ్ ఉన్నారు.

– పాలమూరు, మార్చి 16



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్నల క్ష్మారెడ్డి, చిత్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

## కుట్ర పూరితంగానే కవిత అరెస్ట్

• బీఆర్‌ఎస్‌ప్రా బల్యాన్ని తగ్గించేందుకు ఒక్కటైన బీజేపీ, కాంగ్రెస్
• విజయ్‌మాల్యా, నీరవ్ మోదీలను ఎందుకు అరెస్ట్ చేయరు?
• బీఆర్‌ఎస్‌జి ల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

నవాబ్‌పేట, మార్చి 16 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కుట్రపూరితంగా అరెస్టు చేశారని బీఆర్‌ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఆరోపించారు. శనివారం మండలంలోని గురుకుంటలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసం కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు కుమ్మక్కై కవితను అక్రమంగా అరెస్టు చేశారని విమర్శించారు. సుప్రీంకోర్టులో కేసు కొనసాగుతుండగానే ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. ఈనెల 19వ తేదీన విచారణ జరగాల్సి ఉండగా, అంతలోనే ఎందుకు అరెస్టు చేయాల్సి వచ్చిందన్నారు. ఈడీ వంటి నిఖార్సైన సంస్థను బీజేపీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదని ధ్వజమెత్తారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ఒక్కరోజు ముందు అరెస్టు చేయడం ముమ్మాటికీ అక్రమ అరెస్టేనన్నారు. అనంతరం ఎంపీ మన్నె మాట్లాడుతూ అవినీతి, అక్రమాలను వెలికి తీయాలనుకుంటే విజయ్‌మాల్యా, నీరవ్‌మోదీ వంటి ఆర్థిక నేరస్తులను ఎందుకు అరెస్టు చేయలేదో వివరించాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మాడెమోని నర్సింహులు, వైస్ ఎంపీపీ సంతోశ్‌రెడ్డి, నాయకులు రాంప్రసాద్, నాగిరెడ్డి, లక్ష్మయ్య, ప్రతాప్, చెన్నయ్య, మధుసూదన్‌రెడ్డి, యాదయ్య, శ్రీను, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రాజేందర్‌రెడ్డి

## కేసు కోర్టులో ఉండగా ఎలా అరెస్ట్ చేస్తారు?

• బీఆర్‌ఎస్ పేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి


నారాయణపేట, మార్చి 16 : ఒక వైపు కోర్టులో కేసు నడుస్తుండగా మరో వైపు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్టు చేయడం రాజకీయ కుట్రలో భాగమేనని, అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు నారాయణపేట బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రాన్సిట్ వారెంట్ లేకుండా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. అరెస్టు చేయమంటూ సుప్రీంకోర్టుకు మాట ఇచ్చిన తర్వాత ఇప్పుడు ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. సుప్రీంకోర్టులో చెప్పిన మాటను తప్పుతున్న ఈడీ అధికారులు కోర్టు ద్వారా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను దెబ్బ తీసేందుకే బీజేపీ తన అధికారాన్ని ఉపయోగించుకొని అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నదన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు చంద్రకాంత్, జగదీశ్, సుదర్శన్‌రెడ్డి, చెన్నారెడ్డి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తి పట్టణంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# ఆగ్రహ జ్వాల

• కవిత అరెస్టుపై భగ్గుమన్న ఉమ్మడి జిల్లా
• దద్దరిల్లిన పాలమూరు, వనపర్తి, గద్వాల జిల్లాలు
• పలు చోట్ల ధర్నాలు, రాస్తారోకోల హోరు
• కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనాలు
• తెలంగాణ బిడ్డపై కేంద్రం కక్ష సాధింపు చర్యగా పేర్కొంటూ బీఆర్‌ఎస్ ఆందోళన
• ఎంపీ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరిక



జడ్చర్లలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

రాజకీయ ప్రయోజనాల కోసం ఎమ్మెల్సీ కవితను ఈడీతో అరెస్ట్ చేయించడంపై ఉమ్మడి పాలమూరు జిల్లా భగ్గుమన్నది. దేశ సంక్షేమం కోసం గొంతెత్తుతున్న గులాబీ బాస్ కేసీఆర్‌ను ధైర్యంగా ఎదుర్కోలేక కేంద్రంలో ప్రతిపక్షం, అధికారపక్షంగా ఉన్న కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణలో ఒక్కటై బీఆర్‌ఎస్‌ను దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తున్నాయని రాస్తారోకోలు, ధర్నాలతో శనివారం నిరసన తెలిపారు. బీజేపీకి ఎన్నికల్లో ఎదుర్కొనే దమ్ము లేక ప్రభుత్వ సంస్థలను పావుగా వాడుకొని అక్రమంగా అరెస్టులు చేయిస్తున్నదని దుయ్యబట్టారు. ఇదంతా కాంగ్రెస్, బీజేపీ పక్కా ప్లాన్‌తోనే చేశాయంటూ ప్రధాని దిష్టిబొమ్మలను దహనం చేశారు. సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ కవితను కావాలనే ఎన్నికలకు ముందు అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పడం ఖాయమని బీఆర్‌ఎస్ నేతలు హెచ్చరించారు. మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. వెంటనే కవితపై పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

*- మహబూబ్‌నగర్, మార్చి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



కవిత అరెస్ట్‌ను నిరసిస్తూ మహబూబ్‌నగర్‌లో నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు



మహబూబ్ నగర్‌లో..



జడ్చర్లలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులను లాక్కెళ్తున్న పోలీసులు



వనపర్తిలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు




ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌ను నిరసిస్తూ గద్వాలలో ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

# సార్వత్రిక నగారా

• పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల
• ఆయా జిల్లాల కలెక్టర్ల ప్రకటన
• ఏప్రిల్ 18న నోటిఫికేషన్
• మే 13వ తేదీన పోలింగ్, జూన్ 4న ఫలితాలు
• అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
• ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు
• గెలుపే ధ్యేయంగా గులాబీ పార్టీ అడుగులు

మహబూబ్‌నగర్, మార్చి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికల నగరా మోగింది. ఈ మేరకు శనివారం కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కలెక్టర్లు ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తూ ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని ప్రకటించారు. వచ్చేనెల 18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందని, మే 13న పోలింగ్ నిర్వహించి, జూన్ 4న ఫలితాలను ప్రకటిస్తారన్నారు. దీంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల హడావిడి ప్రారంభమైంది. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులను ఖరారు చేశారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ సిట్టింగ్ స్థానాల్లో గెలుపొందేందుకు గులాబీ పార్టీ పావులు కదుపుతున్నది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 17,35,814 మంది ఓటర్లు ఉన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 16,81,643 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం తుది జాబితాను ప్రకటించింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పకడ్బందీగా ఎన్నికలను నిర్వహించాలని వనపర్తి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి అభ్యర్థులను ప్రకటించగా, నాగర్‌కర్నూల్‌లో బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులను ప్రకటించగా, కాంగ్రెస్ ఇంకా స్పష్టతనివ్వలేదు. అన్ని పార్టీలకు ముందుగానే భారత రాష్ట్ర సమితి మహబూబ్‌నగర్ ఎంపీ స్థానాన్ని సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి కేటాయించింది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాన్ని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు స్థానం కల్పించింది. ఈ మేరకు అన్ని సెగ్మెంట్లలో మాజీ ఎమ్మెల్యేలు మంత్రులకు గెలుపు బాధ్యతలు అప్పగించారు.



***ఓటర్ల వివరాలు ఇలా..***

మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 16, 81,643 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 8,32,080 మంది పురుషులు, 8,48,293 మంది మహిళలు, 44మంది ట్రాన్స్‌జెండర్లు, 1,226 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 17,35,814 మంది ఓటర్లు కాగా, 8,64, 034 మంది పురుషులు, 8,70,694 మంది మహిళలు, 45 ట్రాన్స్‌జెండర్లు, 1,041 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు.

***ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి..***

పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని వనపర్తి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కలెక్టర్ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈ మేరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించకుండా చర్యలు చేపట్టాలని, వచ్చే 72గంటల్లోపు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. ఆయుధాల లైసెన్సులు కలిగిన వారందరితో మాట్లాడి పోలీస్‌స్టేషన్లలో డిపాజిట్ చేసేలా సిబ్బందిని ఆదేశించినట్లు ఎస్పీలు ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికల వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తు చేపట్టాలని, చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉంచాలని ఆయా జిల్లా ఎస్పీలు, పోలీస్ సిబ్బందిని ఆదేశించారు.

## రెండు స్థానాల్లో నువ్వా నేనా..?

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు ఎంపీ స్థానాలు ఉన్నాయి. మహబూబ్‌నగర్ ఎంపీ స్థానం జనరల్ కాగా, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం ఎస్సీలకు రిజర్వ్ చేయబడింది. ఈ రెండు స్థానాల్లో భారత రాష్ట్ర సమితికి చెందిన అభ్యర్థులు సిట్టింగ్ ఎంపీలుగా కొనసాగుతున్నారు. ఇందులో మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా మరోసారి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గులాబీ పార్టీ అభ్యర్థిగా ప్రకటించింది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో సిట్టింగ్ ఎంపీగా ఉన్న రాములు ఇటీవల పార్టీ మారి బీజేపీలో చేరడంతో ఆ స్థానంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను బరిలో నిలిపారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ నుంచి వంశీచంద్‌రెడ్డి, బీజేపీ నుంచి డీకే అరుణకు ఆయా పార్టీలు టికెట్లు కేటాయించాయి. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు మొదలైంది. ఎవరికి టికెట్ ఇస్తారనే క్లారిటీ రావడం లేదు. ఈ రెండు స్థానాల్లో ముక్కోణపు పోటీ అనివార్యంగా కనిపిస్తున్నది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి అప్పుడే వ్యతిరేకత రావడంతో ఇతర పార్టీల నేతలను చేర్చుకునే ప్రయత్నంలో మునిగిపోయారు. ఇక బీజేపీ కూడా ఎలాగైనా రెండు స్థానాల్లో ఒక్క స్థానమైనా గెలుచుకోవాలని చూస్తున్నది. తిరిగి రెండు సిట్టింగ్ స్థానాలను భారత రాష్ట్ర సమితి దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలకు టఫ్ ఫైట్ కొనసాగేలా ఉందని విశ్లేషకులు అంటున్నారు.